సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 21 । జూలై । 2024



'అపెక్స్'పై విజిలెన్స్ దాడులు

నకిలీ డీజిల్ తయారు చేస్తున్న ఓ పరిశ్రమ, పెట్రోల్ పంప్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. 8లో▸



గెలవాలి.. గెలిపించాలి

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులే ప్రస్తుత కాంగ్రెస్ పునరావృతం చేస్తోందని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో▸



ఆదరాభిమానాలు మరువం

ఇబ్రహీంపట్నం ప్రజలు చూపిన ఆదరాభిమానాలు మరువలేమని మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ అన్నారు. 8లో▸

23న ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.



అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : ఇబ్రహీంపట్నం
కమిషనర్ : రవీంద్రసాగర్
తేదీ : 23-7-2024 (మంగళవారం)
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్లు :
73867 04867, 76758 29268

న్యూస్‌రీల్

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను పూర్తిగా తుంగలో తొక్కుతోందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో శనివారం గవర్నర్‌ను కలిసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్న నిరుద్యోగులపై దాడులు జరుగుతున్నాయని, దీనికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 30వేల ఉద్యోగాల భర్తీ కోసం వేసిన నోటిఫికేషన్ల ఉద్యోగాలను తామే ఇచ్చామని గొప్పలు చెప్పుకోవడం సరికాదని అన్నారు. మొదటి సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై, నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

సాక్షి ఫోన్ ఇన్



సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

- పాలకవర్గంతో సమన్వయం చేసుకుంటాం
- ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూస్తాం
- కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీ
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు అనూహ్య స్పందన

'జిల్లాలోనే కొత్తూరును ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి మున్సిపల్ పాలకవర్గంతో కలిసి కృషి చేస్తున్నాం.. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం' అని మున్సిపల్ కమిషనర్ ఎన్. బాలాజీ అన్నారు. మున్సిపాలిటీలో నెలకొన్న ఆయా సమస్యలపై శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ప్రజలు ఫోన్‌లో దృష్టికి తెచ్చిన ప్రతి సమస్యను కమిషనర్ నోట్ చేసుకున్నారు. ఓపికగా సమాధానాలు చెబుతూ ఆయా సమస్యలను పాలకవర్గం, సిబ్బందితో చర్చించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. – కొత్తూరు

☛ 3వ వార్డులోని ఆయా కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని చోట్ల వర్షాలకు పైపుల్లో మట్టి పేరుకుపోయింది. మురుగు నీరు సక్రమంగా ప్రవహించడం లేదు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడంతో ఈగలు, దోమల బెడద పెరిగింది.

– జహంగీర్, ప్రకాశ్, పట్నం చంద్రయ్య

కమిషనర్: క్షేత్రస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ తీరును పరిశీలిస్తాం. మట్టితో పూడుకున్న పైపులైన్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

☛ 3వ వార్డులోని పలు కాలనీల్లో ఖాళీ ప్లాట్లలో చెత్త పేరుకుపోతోంది. ఖాళీ ప్లాట్ల యజమానులు స్థానికంగా అందుబాటులో ఉండడం లేదు. ప్లాట్లలో గడ్డి, కంప చెట్లు పెరుగుతున్నాయి. వర్షాలకు దోమలు పెరిగాయి. పాత పంచాయతీ కార్యాలయం పక్కన విద్యుత్ తీగలకు తాత్కాలికంగా ఇనుప స్తంభాన్ని ఏర్పాటు చేశారు. వర్షాకాలం కావడంతో సంభం నుంచి షాక్ వస్తోంది.

– భాస్కర్‌గౌడ్

కమిషనర్: ఇనుప విద్యుత్ స్తంభాన్ని వెంటనే మార్చి సిమెంట్ స్తంభం ఏర్పాటు చేస్తాం. ఖాళీ ప్లాట్ల యజమానులకు నోటీసులిచ్చి పరిశుభ్రం చేసుకోవాలని కోరతాం. స్పందించకుంటే సిబ్బందితో గడ్డి, చెత్తను తొలగిస్తాం.

☛ 4వ వార్డులోని కొత్తూరు తండాలో ఇళ్లకు సమీపంలోనే మురుగు నీరు పారుతోంది. ఫాగింగ్ చేయాలని కోరినా స్పందించడం లేదు. తండాలో కొంత కాలంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది.

– గోపాల్‌నాయక్, సురేష్

కమిషనర్: విద్యుత్ సరఫరాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేసేలా సిబ్బందిని ఆదేశిస్తాం. మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం.

☛ మున్సిపల్ పరిధిలోని 8, 9వ వార్డుల్లో ఉన్న పలు కాలనీల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేవు. మిషన్ భగీరథలో భాగంగా అన్ని రోడ్లను తవ్వడంతో గుంతలమయంగా మారాయి. కొన్ని చోట్ల మురుగు కాల్వలు పూడికతో నిండుకున్నాయి.

– రంజిత్, శ్రీనివాస్

కమిషనర్: అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం ఇప్పటికే పాలకవర్గంతో చర్చించడం జరిగింది. సాధ్యమైనంత త్వరలో పనులు చేపట్టి సమస్యను పరిష్కరించేలా చూస్తాం.

☛ 6వ వార్డులో పలు ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇప్పటికే విద్యుత్ షాక్‌తో పలువురు మృతి చెందారు. ఇటీవల కాలనీలో పలుచోట్ల సీసీరోడ్లు కొత్తగా వేశారు. కానీ పనులు పూర్తి చేయలేదు. వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

– వి.నర్సింహ, శ్రీను

కమిషనర్: ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా మారిన తీగల గురించి ట్రాన్స్‌కో అధికారులకు సూచిస్తాం. అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల పనులను పరిశీలించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.

☛ 12వ వార్డు తిమ్మాపూర్–చేగూరు రోడ్డులో ఓపెన్ నాలా ఉంది. ఇక్కడ మురుగు నీరు ప్రవహిస్తోంది. రాత్రి, పగలు తేడా లేకుండా దోమలు విజృంభిస్తున్నాయి. హనుమాన్ ఆలయం ఎదురుగా గుంతలో నీరు నిల్వ ఉంటోంది.

– శ్రీధర్, నర్సింహారెడ్డి

కమిషనర్: ఇళ్ల సమీపంలో నుంచి ప్రవహిస్తున్న ఓపెన్ నాలాను పరిశీలించి ఉన్నతాధికారులకు సమస్యను నివేదిస్తాం. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్, ఇతర చర్యలు తీసుకుంటాం.

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

- ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం
- మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- బడంగ్‌పేట్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బడంగ్‌పేట్: ప్రజలకిచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటామని, ఆ దిశగా విజయవంతంగా అడుగులు వేస్తున్నామని ఐటీ శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో రూ.38 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం మేయర్ చిగురింత పారిజాత అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ఆరు నెలలుగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 64 కోట్ల ఉచిత టికెట్లు జారీ చేశామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత వరకు ఫ్రీ బస్ సేవలు కొనసాగుతాయని స్పష్టంచేశారు. అర్హత కలిగిన ప్రతీ ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామని వెల్లడించారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకునేవారికి రూ.5 లక్షల సాయం అందజేస్తామని తెలిపారు. గత కాంగ్రెస్ హయాంలో మహిళా సంఘాలను లక్షాధికారులను చేయగా ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో కోటీశ్వరులను చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల స్కూల్ యూనిఫారాలు గత ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టిందన్నారు. తమ హయాంలో ఈ బాధ్యతలను మహిళా స్వశక్తి సంఘాలకు అప్పగిస్తున్నామని తెలిపారు. మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేసుకునే సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు ఏర్పాట్లు చేస్తామని స్పష్టంచేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల తల్లిదండ్రులతో అమ్మ ఆదర్శ కమిటీలను నియమిస్తామని చెప్పారు. స్కూల్ బాగోగులు, శానిటేషన్, అదనపు గదుల నిర్మాణానికి రూ.800 కోట్లు కేటాయించామని తెలిపారు. గత పదేళ్లుగా పెరిగిన జనాభా ఆధారంగా రేషన్‌కార్డులు పెంచకపోవడం దురదృష్టకరమన్నారు. త్వరలోనే కార్డుల అందజేత ప్రక్రియకు శ్రీకారం చుడుతామని ప్రకటించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేశామని, వచ్చే నెలలో రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను ఛిన్నాభిన్నం చేసినా.. అన్నింటినీ తట్టుకుని పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలు కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, ఆర్డీఓ సూరజ్‌కుమార్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, ఆదిబట్ల మునిసిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు



మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై నిలిచి వర్షం నీటిలోంచి వెళ్తున్న వాహనాలు

ముసురు.. ముసుగు

- ఏకధాటిగా కురుస్తున్న వర్షం
- రాజేంద్రనగర్‌లో అత్యధికం.. కడ్తాల్‌లో అత్యల్పం
- జనజీవనానికి అంతరాయం
- సీజనల్ వ్యాధులతో జాగ్రత్త అంటున్న వైద్యులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: రెండు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. నెలల తరబడి సరైన వర్షాలు లేక ఇప్పటికే పూర్తిగా అడుగంటిన చెరువులు, కుంటల్లోకి వరదనీరు వచ్చి చేరుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం అత్యధికంగా రాజేంద్రనగర్‌లో 1.46 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, శంకర్‌పల్లి, గండిపేటలో 1.43 సెంటీమీటర్లు నమోదైంది. శంషాబాద్‌లో 1.38, మొయినాబాద్‌లో 1.30, సరూర్‌నగర్, శేరిలింగంపల్లి, బాలాపూర్, హయత్‌నగర్‌లో 1.28 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా ఫరూఖ్‌నగర్, కేశంపేట, ఆమనగల్లు, యాచారం, కడ్తాల్‌లో 0.95 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఏకధాటిగా కురుస్తున్న చిరు జల్లులకు బీడువారిన భూముల్లో పచ్చని పైర్లతో కనువిందు చేస్తుండగా.. మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని వీధులు చిత్తడిగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు సృష్టిస్తున్నాయి.

మంచం పట్టిన పల్లెలు

వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకున్న మార్పులకు తోడు, కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల్లోకి కొత్త నీరు వచ్చి చేరుతుండటం, ఆ నీటిని మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తుండటం, నిర్దేశిత ప్రమాణాల మేరకు ఆ నీరు ఫిల్టర్ కాకపోవడం, కాచివడపోయకుండానే ఆ నీటిని తాగుతుండటంతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. దీనికి ఈగలు, దోమలు తోడవుతున్నాయి. ఫలితంగా ప్రస్తుతం నగరానికి ఆనుకుని ఉన్న బస్తీల్లోనే కాదు మారుమూల పల్లెల్లోని ఏ ఇంట్లోకి తొంగి చూసినా వాంతులు, విరేచనాలు, దగ్గు, జలుబుతో బాధపడుతున్న జ్వరపీడితులే దర్శనమిస్తున్నారు. జిల్లాలో అధికారికంగా ఇప్పటికే వందకుపైగా డెంగీ కేసులు నమోదు కాగా, అనధికారికంగా మరో వంద వరకు ఉన్నట్లు సమాచారం. బాధితులు చికిత్సల కోసం సమీపంలోని ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. సహజంగానే ఈ సమయంలో దోమలు, ఈగల బెడద ఎక్కువ. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ చేతులను శుభ్రం చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు వేడిచేసి, చల్లార్చిన నీటినే తాగాలి. తాజాగా అప్పుడే వండివార్చిన ఆహారాన్ని తీసుకోవాలి.

– డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

నాడు పాలకులు నేడు శ్రామికులు

సండే స్పెషల్

ఒకప్పుడు పల్లెల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు.. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపించారు.. మేమున్నామంటూ జనానికి భరోసా కల్పించారు.. సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేశారు.. అధికారులను సమన్వయం చేసుకుంటూ.. ప్రజలతో మమేకమవుతూ గ్రామాల ప్రగతిలో తమదైన ముద్ర వేశారు.. కట్ చేస్తే ఐదేళ్ల వారి పదవీ కాలం ముగిసిపోయింది.. దీంతో ఇక కుటుంబాలపై దృష్టి సారించారు.. ఇన్నాళ్లు పల్లెబాట పట్టిన వారంతా ఇప్పుడు బతుకువేట సాగిస్తున్నారు.

దాబా నిర్వహణలో మాజీ ఎంపీపీ



కందుకూరు ఎంపీపీగా ఐదేళ్లు సమర్థవంతంగా పని చేసిన తిమ్మాపూర్‌కు చెందిన మంద జ్యోతి పదవీ కాలం పూర్తి కావడంతో భర్తతో కలిసి వ్యాపారంపై దృష్టి సారించారు. శ్రీశైలం హైవేపై పెద్దమ్మతల్లి దేవాలయం ఎదుట దాబా ఏర్పాటు చేసుకుని బిజీగా మారారు. అవసరాన్ని బట్టి వంట పనులు కూడా స్వయంగా చూసుకుంటున్నారు. ఎంపీపీ పదవికి ముందు ఆమె ఉపాధిహామీ పనులకు సైతం వెళ్లేవారు. ప్రస్తుతం దాబాకు వచ్చే కస్టమర్లకు వడ్డించే పనిలో నిమగ్నమయ్యారు. 'ప్రజలు ఐదేళ్లపాటు అప్పగించిన పనిని నిస్వార్థంగా పూర్తి చేశాను.. ప్రస్తుతం కుటుంబ పోషణ కోసం దాబా ఏర్పాటు చేసుకున్నాం.. కష్టపడటంలో ఎంతో ఆత్మసంతృప్తి ఉంటుంది' అంటున్నారామె. – కందుకూరు

మొబైల్ షాపు నడుపుతూ



వెల్జాల్‌కు చెందిన ఎండీ ముజిబర్ రెహ్మాన్ మొబైల్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తుండేవారు. రాజకీయ అరంగేట్రం చేసి పేదలను ఆదుకుంటూ అనతికాలంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. ఫలితంగా జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడిగా పదవి వరించింది. నాటి నుంచి నిత్యం ప్రజల మధ్య ఉంటూ సేవలందించే వారు. జెడ్పీ సమావేశాల్లో స్థానిక సమస్యలు దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేసేవారు. ఇటీవల పదవీ కాలం ముగియడంతో తిరిగి తన మొబైల్ షాపుపై దృష్టి సారించారు. సెల్‌ఫోన్లు విక్రయిస్తూ, రిపేర్ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. – తలకొండపల్లి

కుటుంబ పోషణ కోసం పాన్‌షాప్



షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి సర్పంచ్‌గా పనిచేశారు సమ్మి పెంటయ్య. గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశారు. స్వయంగా రూ.20లక్షలు అప్పు చేసి పనులు చేపట్టారు. ఎకరా భూమి, 500 గజాల ప్లాట్ అమ్మి సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మాణం చేపట్టారు. గతంలో డ్రైవర్‌గా పనిచేశానని.. ఆ తర్వాత పాన్‌షాప్ నిర్వహించానని తెలిపారు. పదవిలో ఉండగా చేసిన పనులకు ఇప్పటివరకు బిల్లులు రాలేదని.. దీంతో కుటుంబ పోషణ నిమిత్తం ప్రస్తుతం తిరిగి పాన్‌షాపు చూసుకుంటున్నానని చెప్పారు. – షాబాద్

ఉపాధి నిమిత్తం చిరువ్యాపారం



మంచాల మండలం లోయపల్లి గ్రామానికి చెందిన పోలమోని రాజేశ్వరి వైస్ ఎంపీపీగా సేవలందించారు. చిన్న కుటుంబం. నిత్యం కష్టం చేస్తే తప్ప ముందుకు సాగని పరిస్థితి. అయినా ప్రజలకు సేవ చేయాలనే తపనతో రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో బీసీ మహిళా రిజర్వేషన్ రావడంతో బీజేపీ నుంచి ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారు. మండల సర్వసభ్య సమావేశాల్లో సమస్యలపై అధికారులను నిలదీస్తూ పరిష్కారానికి కృషి చేశారు. ఇటీవల పదవీ కాలం ముగియడంతో ఇంటి వద్ద బ్యాంగిల్ స్టోర్ నడిపిస్తున్నారు. 'ప్రజా ఆశీర్వాదంతో ఐదేళ్లపాటు సేవ చేసే భాగ్యం లభించింది.. అవకాశం వస్తే భవిష్యత్‌లో కూడా ప్రజా సేవ చేయడానికి కృషి చేస్తాను' అంటున్నారు. – మంచాల

నాడు సర్పంచ్‌గా నేడు రైతుగా..



చేవెళ్ల మండలంలోని బస్తేపూర్‌కు చెందిన నర్సింలు ఐదేళ్లు సర్పంచ్‌గా ప్రజలకు సేవలు అందించారు. గ్రామంలో ఆయనకు 9 ఎకరాల పొలం ఉంది. సర్పంచ్ కాక ముందు వ్యవసాయం చేసుకుంటూ ప్రజల మధ్య ఉండేవాడు. ఐదేళ్ల క్రితం ఎస్సీ రిజర్వేషన్ రావటంతో సర్పంచ్‌గా అవకాశం వచ్చింది. విజయవంతంగా ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం ఆయన మళ్లీ తిరిగి వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. స్వయంగా సాగు చేసుకుంటున్నారు. 'వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ఐదేళ్ల పాటు ప్రజా సేవలో తరించాను.. ఇప్పుడు కూడా సొంత పనులు చూసుకుంటూనే ప్రజల మధ్యే ఉంటాను' అంటున్నారు. – చేవెళ్ల

ఫర్టిలైజర్ దుకాణం నడుపుతూ..



చేవెళ్ల మండలం మల్లారెడ్డిగూడ సర్పంచ్‌గా పనిచేసిన మల్గారి మోహన్ రెడ్డి ప్రస్తుతం ఫర్టిలైజర్ యజమానిగా తన పనులు చేసుకుంటున్నారు. 'కొత్త పంచాయతీగా ఏర్పాటు కావడంతో మొదటి సర్పంచ్‌గా అవకాశం వచ్చింది.. గ్రామస్తుల కోరిక మేరకు పోటీ చేశాను.. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేశాను.. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాను.. ప్రజా సేవలో భాగస్వామిని అయినందుకు సంతృప్తిగా ఉంది.. ఇప్పుడు పదవీ కాలం ముగియడంతో ఫర్టిలైజర్ దుకాణం చూసుకుంటూనే గ్రామస్తుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాను..' అంటున్నారు. – చేవెళ్ల

ఎదురెదురుగా కార్లు ఢీ

నలుగురికి గాయాలు

మొయినాబాద్: ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొని నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మేడిపల్లి గేటు సమీపంలో చోటుచేసుకుంది. శనివారం మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మేడిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్, భార్య విజయ, కొడుకు తిమోతి శుక్రవారం రాత్రి చేవెళ్ల మండలంలోని ఎనికేపల్లిలో నిర్వహించిన ఫంక్షన్‌కు మేడిపల్లికి చెందిన డ్రైవర్ రాజు కారును అద్దెకు తీసుకుని వెళ్లారు. ఫంక్షన్ ముగించుకుని రాత్రి 10 గంటల సమయంలో మేడిపల్లికి వస్తుండగా ప్రగతి రిసార్ట్స్ సమీపంలోని మేడిపల్లి గేటు దగ్గరకు రాగానే ఎదురుగా అతివేగం, అజాగ్రత్తతో వచ్చిన కారు, వీరి కారును ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న రాజుతోపాటు మల్లేష్, విజయ, తిమోతిలకు గాయాలయ్యాయి. అతివేగంతో వచ్చి ఢీకొట్టిన కారును ఆపకుండా పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స కోసం స్థానిక భాస్కర ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులోఉంది.

'అపెక్స్'పై విజిలెన్స్ దాడులు

శాంపిళ్లు సేకరించి పరిశ్రమకు తాళం

- పెట్రోల్ పంప్ సీజ్
- రెండు ట్యాంకర్లు స్వాధీనం



పరిశ్రమను సీజ్ చేస్తున్న అధికారులు



డీజిల్ ట్యాంకర్‌ను పట్టుకున్న అధికారులు

నందిగామ: నకిలీ డీజిల్ తయారు చేస్తున్న ఓ పరిశ్రమ, ఓ పెట్రోల్ పంప్‌ను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శనివారం నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపిన ప్రకారం.. నందిగామ శివారు బైపాస్ రోడ్డు సమీపంలో అపెక్స్ బయో ఫ్యూయల్స్ పరిశ్రమలో పలు రకాల క్రూడ్ ఆయిల్స్, రసాయనాలతో నకిలీ డీజిల్ తయారు చేస్తున్నారని సమాచారం అందింది. ఈ మేరకు సివిల్ సప్లై, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం రాత్రి కాపుకాచారు. డీజిల్ ట్యాంకర్ పరిశ్రమ నుంచి బయటకు వెళ్తున్న సమయంలో అధికారులు వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను విచారించారు. అనంతరం పరిశ్రమలోకి వెళ్లి చూడగా ఓ వ్యక్తి కెమికల్స్‌తో డీజిల్‌ను కల్తీచేస్తున్నట్లు గుర్తించారు. ఈ డీజిల్‌ను సమీపంలోని ఓ పెట్రోల్ బంక్, ఇతర కంపెనీలకు పంపిణీ చేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు తెలుసుకుని 12వేల లీటర్ల సామర్థ్యం ఉన్న రెండు ట్యాంకర్లను సీజ్ చేసి శనివారం స్టేషన్‌కు తరలించారు. అనంతరం పరిశ్రమలోని స్టోరేజీ ట్యాంకర్లలో శాంపిళ్లను సేకరించి ఫ్యాక్టరీని సీజ్ చేశారు. అక్కడ నుంచి పెట్రోల్ బంక్ వెళ్లి శాంపిళ్లు సేకరించి పంప్‌ను సీజ్ చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శశిధర్‌రాజు, డీఎస్‌ఓ ఎంకే రాథోడ్, డీటీలు రవీందర్‌నాయక్, రఘునందన్ తదితరులున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మనం గెలవాలి.. పార్టీని గెలిపించాలి



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

- బీఆర్ఎస్ చేసిన తప్పులే కాంగ్రెస్ చేస్తోంది
- రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే
- సన్మాన సభలో చేవెళ్ల ఎంపీ కొండా

చేవెళ్ల: గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులే ప్రస్తుత కాంగ్రెస్ పునరావృతం చేస్తోందని.. నాలుగన్నరేళ్ల తర్వాత రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపడుతుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్‌లో నియోజకవర్గ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ.. మనం గెలువాలి.. మన పార్టీని గెలిపించాలనే లక్ష్యంతో పనిచేస్తేనే విజయం సాధిస్తామని.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా మనం సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. వార్డు సభ్యుడి నుంచి జిల్లా పరిషత్ వరకు బీజేపీ అభ్యర్థులే గెలిచేలా ప్రతీ ఒక్కరు పనిచేయాలన్నారు. మనం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు పనిచేయాలన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. మన మంచితనం మనల్ని గెలిపిస్తాయని చెప్పారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు పనిచేస్తున్నాను. హైదరాబాద్-బీజాపూర్‌జాతీయ రహదారి పనులను త్వరిత గతిన పూర్తి చేయించేందుకు కృషిచేస్తున్నానని.. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను కేంద్ర మంత్రితో చర్చిస్తున్నట్లు వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన స్కామ్‌లు ఒక్కొటిగా బయటకు వస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం కేంద్రం ఇచ్చే నిధులతోనే పాలన సాగిస్తోందని చెప్పారు. అనంతరం ఎంపీని మండలాల వారీగా నాయకులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రభాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, విజయలక్ష్మి, కావ్యగౌడ్, వెంకట్‌రాంరెడ్డి, వైభవ్‌రెడ్డి, శర్వలింగం, కృష్ణగౌడ్, రాములు, పరమేశ్వర్‌రెడ్డి, నాగరాజు, అశోక్, వెంకటేశ్, శ్రీనివాస్, నియోజకవర్గంలోని ఐదు మండలాల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మీ ఆదరాభిమానాలు మరువం

- ఇబ్రహీంపట్నంతో విడదీయలేని బంధం
- ఆత్మీయ సన్మానసభలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ పక్కన సతీమణి అనురాధ

ఇబ్రహీంపట్నం: వైద్యులుగా పరిచమైన తాను, తన సతీమణిపై ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలు చూపిన ఆదరాభిమానం ఎన్నడికీ మరువలేమని కరీంనగర్ జిల్లా మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారి ఇబ్రహీంపట్నం వచ్చిన ఆయనకు శనివారం అంకిత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆత్మీయ స్వాగత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. పుట్టినిల్లు, మెట్టినిల్లు కాకపోయిన వైద్యులుగా 30ఏళ్ల క్రితం తన సతీమణి కోసం అంకిత్ అస్పత్రిని ఏర్పాటు చేశామన్నారు. అప్పటి నుంచి ఈ ప్రాంత ప్రజలు చూపుతున్న ప్రేమానురాగాలతో తమ జీవితం ముడిపడిపోయిందన్నారు. అన్నిపక్షాల నాయకులు, ప్రజలు ఎంతో సహకరించారని వారితో మమేకమై ప్రజలకు అందించిన వైద్య సేవలను మరిచిపోలేనన్నారు. అంకిత్ అస్పత్రిలో చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో వారిని ఉస్మానియాకు తీసుకెళ్లి ఆపరేషన్లు చేయించిన విషయాన్ని గుర్తు చేశారు. రాజకీయ ప్రవేశానంతరం ఆస్పత్రిని విక్రయం లేదా లీజ్‌కు ఇద్దామనుకుంటే తన సతీమణి అనురాధ ఒప్పుకోకుండా నేటికీ ఇక్కడి ప్రజలకు సేవలందిస్తుందన్నారు. ఆమె సహకారంతోనే తాను ఎమ్మెల్యే అయ్యాననన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి అనురాధ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

మల్‌రెడ్డికి మంత్రి పదవి రావాలి

స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అనుకోకుండా ఢిల్లీ పర్యటనలో ఉండడంతో ఈ కార్యక్రమానికి హాజరవ్వలేదని.. ఆయనకు తప్పకుండా మంత్రి పదవి రావాలని కవ్వంపల్లి ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంకిత్ అస్పత్రి ఎండీ ప్రకాశ్, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్లు నిరంజన్‌రెడ్డి, స్రవంతి, వైస్ చైర్మన్ మంగ, మాజీ ఎంపీపీ కృపేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూధన్‌రెడ్డి, కౌన్సిలర్లు సత్యనారాయణ, రమేష్‌గౌడ్, యాచారం సుజాత, పార్టీ నాయకులు గురునాథ్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, ప్రసన్నకుమార్, కేవీ రమేష్‌రాజు, రాములు, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్, యాచారం రవీందర్, బీఎస్పీ నాయకులు రఘుపతి, ఉద్యోగ సంఘాల నేతలు అయోధ్య, అడ్వకేట్ ఇజ్రాయిల్, వివిధ సంఘాల నేతలు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

'మొక్క'బడిగా చేస్తే సహించేది లేదు

- నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం బాధ్యత పంచాయతీలదే..
- కార్యదర్శులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు
- డీఆర్‌డీఓ శ్రీలత



చౌదరిగూడలో యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత తదితరులు

కొందుర్గు: నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకం పూర్తి బాధ్యత గ్రామ పంచాయతీలదేనని, కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ శ్రీలత హెచ్చరించారు. కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లోని పలు గ్రామాల్లో నర్సరీలను శనివారం సందర్శించడంతోపాటు మొక్కలు నాటారు. అనంతరం రెండు మండలాల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో కొందుర్గు మండలపరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు మొక్కలు నాటడంలో పూర్తిగా వెనుకబడి ఉన్నారని, లక్ష్యాన్ని చేరుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. కూలీలకు 100 రోజులు పని కల్పించడంలో విఫలమవుతున్నారని అన్నారు. కూలీల ఆధార్ అనుసంధానంలోనూ 100 శాతం పూర్తిచేయడం లేదన్నారు. ప్రతి గ్రామంలో ఆరు వేల మొక్కలు, మండలానికి 50 వేల మొక్కలు నాటాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో 80 రోజులు పూర్తయిన కూలీలను గుర్తించి మొక్కలకు గుంతలు తీయించడం, మొక్కలు నాటడం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం గుంతలు తీయించాలని, మొక్కుబడిగా చేస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఉన్నతి పథకం ద్వారా కూలీలకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. 100 రోజులు పని పూర్తిచేసిన కూలీలకు ఈ పథకంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మగ్గం వర్క్, టైలరింగ్, అల్లికలు తదితర 80 రకాల కోర్స్‌లపై శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం ఆమె చౌదరిగూడలో మహిళలు విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టే విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సుహాసిని, ఏపీడీ సక్రియ, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంపీఓలు లాలయ్య, విజయ్ కుమార్ పాల్, ఏపీఓలు నర్సింగ్ రావు, ప్రవళిక పాల్గొన్నారు.